క్లుప్తంగా

ప్రజా సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం



స్తంభాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయమని మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్లరబ్బాని అన్నారు. 25 వార్డులో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండటంతో విషయాన్ని గడప గడప కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సత్వరమే సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాసులు నూతన విద్యుత్ స్తంభాలను మంజూరు చేయటంతో వైస్ చైర్మన్ రబ్బాని వార్డులో అవసరమున్న చోట వాటిని ఏర్పాటు చేయించి విద్యుత్ తీగలు కిందికి వేలాడకుండా చర్యలు తీసుకున్నారు. రబ్బాని మాట్లాడుతూ వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జాకీర్‌బాషా, రియాజ్, చాంద్‌బాషా, పసుపుల శ్రీనివాసులు నాయుడు, అబ్బాస్, ఆఫ్రిద్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి గ్రావెల్ రోడ్డు



మిడుతూరు జగనన్న కాలనీలో గ్రావెల్ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

మిడుతూరు: స్థానిక జగనన్న కాలనీలో గ్రావెల్ రోడ్డు పనులను ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్, సర్పంచ్ లక్ష్మమ్మ బుధవారం పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న కాలనీలో గతంలో వేసిన రహదారులు వర్షానికి దెబ్బతినడంతో ఇళ్ల నిర్మించుకునే లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తున్నాయన్నారు. దీంతో సర్పంచ్ ఆధ్వర్యంలో గుంతలు పడినచోట గ్రావెల్ నింపి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చేశారు. మార్కెట్ మాజీ చైర్మన్ శివరామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధీర్ పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్ పరిశీలన

మండల పరిధిలోని 49-బన్నూరు గ్రామంలో జగనన్న లే అవుట్‌ను ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్ పరిశీలించారు. జగనన్న కాలనీలో విద్యుత్, నీటి సమస్యలపై ఆరాతీశారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

రైతులతో ముఖాముఖి



రైతులతో చర్చిస్తున్న ఆర్డీఓ దాసు, జలవనరుల శాఖ అధికారులు

కొత్తపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మకూరు ఆర్డీఓ దాసు, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని శివపురం, గోకవరం, కొత్తపల్లి రైతులతో బుధవారం ముఖాముఖి నిర్వహించారు. ఎం.లింగాపురం గ్రామ పొలిమేరలో గోకవరం పుల్లారెడ్డి చెరువుకు సంబంధించి పంటకాల్వలతవ్వకంపై చర్చించారు. రైతులతో వారి సమ్మతిని, అనుమానాలను నివృతి చేశారు. కొంతమంది రైతులు పంట కాల్వలు తీసేందుకు భూములు ఇవ్వమని చెప్పారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి భూమి కొల్పోయే రైతులకు నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. గోకవరం పుల్లారెడ్డి ట్రస్టు వారు చేరువు నిర్మాణం చేశారని, వారే ఉచితంగా పంటకాల్వల కూడా నిర్మాణం చేస్తామని కలెక్టర్‌ని కలిశారని చెప్పారు. ఏపీ సమస్యలు ఉన్నాయన్న విషయాలను రైతులనుంచి సేకరించాలని వీఆర్వోలకు సూచించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఈఈ రఘురామిరెడ్డి, డీఈ జయరాములు, ఏఈఈ నాగన్న, డిప్యూటీ తహసీల్దార్లు మనోహర్, పెద్దన్న పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: రేనాటివీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిరస్మరణీయుడని నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చైర్మన్ మాట్లాడుతూ తెల్లదొరలను ఎదురించి పోరాడిన రాయలసీమ పులిబిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డితోనే దేశస్వాతంత్ర్య పోరాటానికి బీజం పడిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు కేశవరెడ్డి శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రజినీకుమార్ రెడ్డి, వీరం మురళీధర్‌రెడ్డి, నాగసేనారెడ్డి, అంరెడ్డి వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటలకు అందలం

- నియోజకవర్గానికి రెండు ఇండోర్ స్టేడియాలు
- శరవేగంగా సాగుతున్న పనులు
- మార్చి నాటికి పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు



నందికొట్కూరులో ఇండోర్ స్టేడియం పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



పగిడ్యాలలో శరవేగంగా రూపుదిద్దుకుంటున్న ఇండోర్ స్టేడియం పనులు

పగిడ్యాల: టీడీపీ ప్రభుత్వ హయాంలో క్రీడలకు సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ప్రతిభావంతులైన క్రీడాకారులు సరైన శిక్షణ, ప్రోత్సాహంలేక భవిష్యత్‌ను కోల్పోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడలకు పెద్దపీట వేసింది. గ్రామీణ ప్రాంతంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్‌ను అందించాలనే సంకల్పంతో ఒకప్పుడు జిల్లా కేంద్రాలకే పరిమితమయిన క్రీడా స్టేడియాలను మండలాలకు సైతం అందుబాటులోకి తెచ్చింది.

నిధులు కేటాయించని గత ప్రభుత్వం

నియోజకవర్గంలోని పగిడ్యాల మండలంలో పలువురు క్రీడాకారులు కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించినప్పటికీ గత ప్రభుత్వ హయాలలో తగిన ప్రోత్సాహం లేక కనుమరుగయ్యారు. క్రీడలు చదువులో భాగమైనప్పటికీ సరైన శిక్షణకు నోచుకోలేక పోయారు. క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నామంటూ ప్రకటనలు చేయడం తప్ప క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. క్రీడా ప్రాధికార సంస్థ కార్యకలాపాలు ఏమిటో తెలియని పరిస్థితి ఉండేది.

ఒక్కో స్టేడియానికి రూ.1.20 కోట్లు మంజూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గానికి రెండు ఇండోర్ స్టేడియాలను శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మంజూరు చేయించారు. ఒక్కో స్టేడియం నిర్మాణానికి రూ.1.20 కోట్ల నిధులను క్రీడా ప్రాధికార సంస్థ మంజూరు చేసింది. నందికొట్కూరు పట్టణంలో, పగిడ్యాల జిల్లా పరిషత్ హై స్కూలు ప్రాంగణంలో దాదాపు రెండు నెలల క్రితం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మండలంలో ప్రారంభమైన స్టేడియం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. నెల రోజుల్లో క్రీడాకారులు కల నెరవేరనుండడంతో క్రీడాకారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. క్రీడాకారులు సీఎం వైఎస్ జగన్‌తోపాటు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

క్రీడాకారులకు వరం



గతంలో క్రీడా ప్రాంగణాలు జిల్లా కేంద్రాలకే పరిమితం అయ్యేవి. ప్రస్తుతం మండలాలకు విస్తరించడం హర్షనీయం. రాష్ట్ర శాప్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఇండోర్ స్టేడియాలు మంజూరు చేయించడం అభినందనీయం. గతంలో సరైన శిక్షణ లేకపోవడం వలన చాలా మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు కనుమరుగయ్యారు. నేను 1996-97లో నాలుగు పర్యాయాలు జాతీయలో రాణించి గోల్డ్ మెడల్స్ సాధించాను. అప్పట్లో సరైన సౌకర్యాలు లేక ఉన్నత శిఖరాలకు చేరుకోలేక పోయా. ప్రస్తుతం క్రీడల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసి ప్రోత్సహిస్తుండడం ఇప్పటి క్రీడాకారులకు వరం.

– రాగన్న,(గోల్డ్ మెడలిస్ట్) కబడ్డీ జాతీయ క్రీడాకారుడు, పగిడ్యాల

శాప్ చైర్మన్ కృషి ప్రశంసనీయం



క్రీడా ప్రాంగాణాల అభివృద్ధికి రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కృషి ప్రశంసనీయం. నందికొట్కూరు నియోజకవర్గంలో రెండు ఇండోర్ స్టేడియాలు మంజూరు చేయడం క్రీడాకారులకు వరం. గత ప్రభుత్వంలో క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి నిధులు మంజూరు కాలేదు. క్రీడల ప్రాధికార సంస్థ కార్యకలాపాలు ఏమిటో తెలియరాలేదు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జగనన్న క్రీడాసంబరాలు, సీఎం కప్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి క్రీడాకారుల్లో నూతనోత్సాహాన్ని నింపుతున్నారు. ప్రస్తుతం పగిడ్యాల, నందికొట్కూరులో షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, ఇండోర్ స్టేడియాలు రూపుదిద్దుకుంటున్నాయి.

– స్వామిదాసు రవికుమార్, నంద్యాల జిల్లా శాప్ కో ఆర్డినేటర్

ఘనంగా ఆదిదంపతుల గ్రామోత్సవం

బండిఆత్మకూరు బండిఆత్మకూరులో బుధవారం ఆదిదంపతుల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న శివాలయంలో కొలువైన గంగా ఉమా సమేత శివుని ఉత్సవ విగ్రహాలను శివాలయం నుంచి ఓంకార క్షేత్రానికి తీసుకెళ్లారు. అక్కడ కల్యాణం అనంతరం నూతన వధూవరులైన ఆదిదంపతులను తిరిగి బండిఆత్మకూరు తీసుకురావడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉత్సవ విగ్రహాలను మేళతాళాలమధ్య గ్రామంలో ఊరేగించారు. మహిళలు, గ్రామస్తులు టెంకాయలు, కర్పూరం సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం శివాలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

మిడుతూరు/జూపాడుబంగ్లా: ఇంటర్మీడియెట్ విద్యను మధ్యలో నిలిపివేసిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని నందికొట్కూరు, మిడుతూరు ప్రభుత్వ జూనియర కళాశాల్ల ప్రిన్సిపాళ్లు ఎం.షేక్షావలి, శంకర్‌నాయక్ బుధవారం తెలిపారు. apopen school.ap.gov.in ఆన్‌లైన్ చేసిన దరఖాస్తును స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అందజేయాలన్నారు. ఇంటర్ విద్యను పూర్తి చేసుకునేందుకు మంచి అవకాశం ప్రభుత్వం కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహానందిలో ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్



మహానందీశ్వరస్వామి దర్శనార్థం వస్తున్న కొమ్మినేని శ్రీనివాసరావు

మహానంది: ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు దంపతులు బుధవారం మహానందికి వచ్చారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఉదయం స్వామి,అమ్మవార్లకు జరిగిన మహామంగళ హారతుల సేవలో పాల్గొని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి వారికి జ్ఞాపిక, ప్రసాదాలు అందించగా వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. వారి వెంట ఏపీ ప్రెస్ అకాడమీ సెక్రటరీ బాలగంగాధర తిలక్, డాక్టర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం



మాట్లాడుతున్న చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

జూపాడుబంగ్లా: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నుపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యతపు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని బసిరెడ్డి కళాశాలలో ఉపాధ్యాయులు, లెక్చరర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జనరంజకమైన పాలన అందిస్తున్న నేపథ్యంలో ఆయన ఆశీస్సులతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న రవీంద్రారెడ్డిని గెలిపిస్తే పట్టభద్రులకు భవిష్యత్ బాగుంటుందన్నారు. సీఎం సహకారంతో పట్టభద్రుల అభివృద్ధికి దోహదపడే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్సీ విద్యాసంస్థల అధినేత పుల్యాల రామచంద్రారెడ్డి, బసిరెడ్డి కళాశాల చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, కరస్పాండెంట్ నాగసత్యనారాయణ, బసిరెడ్డి కళాశాల డైరెక్టర్ సూదిరెడ్డి రమేష్‌రెడ్డి, నంది కళాశాల ప్రిన్సిపాల్ బద్దుల శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జాన్‌ఎలీషా బాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అబూబక్కర్ తదితరులు పాల్గొన్నారు.

గుట్టు చప్పుడు కాకుండా విజిలెన్స్ విచారణ

పాములపాడు: ఎర్రమట్టి తరలింపుపై విజిలెన్స్ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా విచారణ చేశారు. మండలంలోని బానుముక్కల గ్రామంలో ప్రభుత్వం వీబీఆర్ మరమ్మతుల కోసం గతంలోనే కొనుగోలు చేసిన భూముల్లో ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారనే విషయంపై 'కంచె చేను మేస్తోంది' అనే శీర్షికన బుధవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన విజిలెన్స్ అధికారులు స్థానిక వీఆర్వో, వీఆర్‌ఏలను వెంటబెట్టుకొని ఎర్రమట్టిని తవ్విన ప్రదేశాన్ని పరిశీలించి, రిపోర్టు తయారు చేసుకున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచడంలో ఆంతర్యమేమిటో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. విచారణకు వచ్చిన విజిలెన్స్ అధికారులు తమ పేర్లు చెప్పేందుకు కూడా నిరాకరించినట్లు తెలుస్తోంది.

స్పందన ఫిర్యాదుపై పరిశీలన



మరుగుదొడ్డి ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండలంలోని అలగనూరు గ్రామంలో ఈఓఆర్డీ పక్కృద్దీన్, పంచాయతీ కార్యదర్శి అనురాధ బుధవారం పర్యటించారు. అలగనూరు గ్రామానికి చెందిన పెద్దపాపయ్య స్పందనలో గ్రామంలో మరుగుదొడ్డిని తొలగించాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు గ్రామంలోని మరుగుదొడ్డిని తొలగించేందుకు ప్రయత్నించగా బీసీ కాలనీకి చెందిన మరికొందరు అడ్డుకున్నారు. దీంతో ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శి ఉన్నతాధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా పోలీసు అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షురాలిగా మధులత

నంద్యాల(అర్బన్): గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసు అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షురాలిగా అనుమల మధులత ఎన్నికయ్యారు. మహిళా పోలీసుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ విలేజ్ వార్డు సెక్రటరీయేట్ మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటును చేసింది. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జిల్లా అడహక్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నంద్యాల జిల్లాకు చెందిన కనకాద్రిపల్లె మహిళా పోలీసు జైత్ర శ్రీజారెడ్డి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక కాగా నంద్యాల జిల్లా సెక్రటరీగా విజయలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కళావతి, ఉపాధ్యక్షురాలిగా లలితమ్మ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా మాబున్ని, అత్తర్ గౌషియా, ట్రెజరర్‌గా సుజాత, తేజ, కుషల కుమారి, రేవతి, మైమున్నిసా, ప్రసన్న, శకుంతల, ఇంద్రావతి, జయంతి, యశోదరాణి, హారికలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీజారెడ్డి తెలిపారు.

అడవికి నిప్పు పెడితే చర్యలు

ఆళ్లగడ్డ: అడవికి నిప్పు పెడితే కఠిన చర్యలు తప్పవని చాగలమర్రి మండలం అటవీ శాఖ అధికారి కిశోర్ కుమార్ తెలిపారు. చాగలమర్రి మండలం పెద్దవంగళి గ్రామంలో బుధవారం అడవికి నిప్పు.. అది మనకే ముప్పు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో దండోరా వేయించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ నాగేష్, నరసింహ, రాయుడు, నర్సయ్య ఉన్నారు.

పనిచేసే ప్రదేశంలోనే నివాసముండాలి

పగిడ్యాల: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పనిచేసే గ్రామాల్లోనే నివాసం ఉండాలని ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఇంటి ముంగిటకే పాలన అందించాలనే ఆశయంతో సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారన్నారు. అయితే ఉద్యోగులు ఏ సచివాలయంలో పనిచేస్తున్నారో అక్కడే ఉండి సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని స్పష్టం చేశారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఆయా గ్రామ సచివాలయాల్లోనే నివాసం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పుల్లయ్య, ఎంఈఓ సుభాన్, హౌసింగ్ ఏఈ జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, జావేద్, వీరన్నయాదవ్, కోట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

మిడుతూరు: మండల పరిధిలోని ఉప్పలదడియ గ్రామానికి చెందిన ఓ మహిళ తన భర్తతో పాటు మామ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మారుతీశంకర్ బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఉప్పలదడియ గ్రామానికి చెందిన షేక్ అంజు అనే మహిళను శిరివెళ్ల గ్రామానికి చెందిన సద్దాంకు నాలుగేళ్ల క్రింతం వివాహం జరిగింది. భర్త సద్దాం, మామ ఖాదర్‌బాషా గత కొద్ది నెలల నుంచి అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని అంజు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

25న టాలెంట్ టెస్ట్

వెలుగోడు: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ కిషోర్ తెలిపారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పరీక్షల నిర్వాహణపై చర్చించారు. కిషోర్ మాట్లాడుతూ.. ఈనెల 25న వెలుగోడు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. సమావేశంలో మండల నాయకులు నవీన్ కుమార్, అజయ్, తదితరులు పాల్గొన్నారు

సున్నిపెంటలో చోరీ

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రమైన సున్నిపెంట గ్రామంలో బ్రహ్మంగారి ఆలయం సమీపంలో ఉండే సాల్మన్ రాజు ఇంట్లోకి బుధవారం తెల్లవారు జామున దొంగలు చొరబడి రెండు సెల్‌ఫోన్లు, కొంత నగదు, మరికొంత బంగారాన్ని చోరీ చేశారు. ఈ మేరకు టూ టౌన్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఇటీవల కాలంలో తెల్లవారు జాము సమయంలో గ్రామంలో దొంగతనాలు ఎక్కువయ్యాయి. ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే సుమారు 7 బైక్‌లను దొంగతనం చేశారు. ఈ ఘటనలో ఓ ఎస్సై తో పాటు ముగ్గురు కానిస్టేబుళ్లు సస్పెండ్ కూడా అయ్యారు. రాత్రివేళల్లో పోలీసు గస్తీ లేకపోవడంతోనే విచ్చవిడిగా దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసు యంత్రాంగం రాత్రి వేళలో గస్తీ నిర్వహించడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెంచాలని కోరుతున్నారు.

సరైన సమయానికి బయోమెట్రిక్ వేయాలి



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొత్తపల్లి: సచివాలయ సిబ్బంది ప్రభుత్వం నిర్ణయించిన సమయంలో బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. బుధవారం దుద్యాల, ముసలిమడుగు గ్రామాల సచివాలయాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ సమయపాలన పాటించని వారిపై శాఖా పరమైన చర్యలు తప్పకుండా ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు(ఎస్‌డీజీ సర్వే), ఆయుష్మాన్ భారత్ కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని సూచించారు.

సర్పంచ్‌పై చర్యలు తీసుకోండి

మిడుతూరు: మండల పరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామ సర్పంచ్ చంద్రశేఖరరెడ్డి, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో మంటి వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు తహసీల్దార్ సిరాజుద్దీన్, ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డిలకు వినతి పత్రాలు సమర్పించారు. బుధవారం వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చక్రీ మాట్లాడుతూ ఈ నెల 20న మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న సర్పంచ్ చంద్రశేఖరరెడ్డికి, ట్రాక్టర్‌ను డ్రైవింగ్ చేస్తున్న మంటి వెంకటేశ్వర్లు దారి ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రాత్రి సర్పంచ్ తన అనుచరులతో ఇంటిమీదకు వెళ్లి భయభ్రాంతులుకు గురిచేసినట్లు చెప్పారు. సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు.

బీసీలకు సముచిత స్థానం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ శిల్పా భువనేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న శిల్పా భువనేశ్వరరెడ్డి

ఆత్మకూరు: దేశంలో బీసీలకు ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా సంక్షేమ పథకాలు, ఉన్నత పదవులు కేటాయిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్ శిల్పా భువనేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు అంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని బ్యాక్ బోన్ అని నిరూపించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులలో 60 శాతంపై బీసీలకే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 18 ఎమ్మెల్సీ పదవుల్లో 11 బీసీలకు, 3 ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు ఒరిగింది ఏమీ లేదని, కేవలం బీసీ ప్రభుత్వం అని చెప్పుకోవడం తప్ప వారికి చేసిందేమీ లేదన్నారు. ఆత్మకూరు మండల ఎంపీపీ పదవి అన్‌రిజర్వ్ అయినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశం మేరకు ఎస్సీలకు కేటాయించి, ఎస్సీ మహిళ తిరుపాలమ్మను ఎంపిక చేశామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు 50 శాతం పైగా పార్టీలో పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే కార్పొరేషన్ల ద్వారా డైరెక్టర్ పదవులు, నామినేటెడ్‌పోస్టులు ఇచ్చారని చెప్పారు. అనంతరం బీసీ నాయకులు షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అంజాద్‌అలీ, ఎంపీపీ తిరుపాలమ్మ, గోపవరం పుల్లయ్య, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శివశంకర్‌నాయుడు, మాజీ చైర్మన్ నూర్‌మహ్మద్ మాట్లాడుతూ బీసీలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యత మరువలేనిదని, ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, దేశంతిరుపంరెడ్డి, కోట్ల నాగేశ్వరరెడ్డి, ఇందిరేశ్వరం సర్పంచ్ నారాయణరెడ్డి, విజయ్, హరి, రవినాయక్, నాగన్న, జయరాజ్, ఎల్లారెడ్డి, పువ్వాడభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఆర్థిక సాయం పేదలకు వరం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి కింద అందజేస్తున్న ఆర్థిక సాయం పేదలకు వరంలాంటిదని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వరెడ్డి అన్నారు. కురుకుంద గ్రామానికి చెందిన నాగేశమ్మ అనే మహిళకు మంజూరైన రూ.2,20,000 చెక్కును అందజేశారు.

ఈఈఎంటీలో జిల్లా మొదటి ర్యాంక్



అనిసా తబస్సుమ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్‌కే అనిసా తబస్సుమ్ ఇటీవల నిర్వహించిన ఈఈఎమ్‌టీ (ఎడ్యుకేషన్‌ఎంట్రన్స్ మెరిట్ టెస్ట్)లో తొలిర్యాంక్ సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం సక్రూనాయక్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అనిసా ఈఈఎమ్‌టీ లో మొదటి ర్యాంక్ సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈమెను ఆదర్శంగా తీసుకుని మిగతా విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచిర్యాంక్‌లు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామలింగం, సుధాకర్, నాగులు, చిత్రలేఖ, వెంకటలక్ష్మి, దరగమ్మ, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సునీత ఆత్మహత్యయత్నంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకుడు స్వాములు డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజశేఖర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సునీతను అధికారులు మానసిక్షోభకు గురిచేస్తున్నారన్నారు. ఈ విషయమై నందికొట్కూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పై అధికారుల్లో మార్పు రాకపోవటంతో మానసిక వేదనతో ఆమె ఆత్మహత్యాయత్నానికి యత్నించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుమంత్, తియోతీ, స్వాములు, దావీదు, దయాకర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ చేయించాలి

నందికొట్కూరు పట్టణ మున్సిపాల్టీ కార్యాలయంలో జరుగుతున్న పరిణామాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ బుధవారం అనంతపురంలో మున్సిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తికి ఏఐటీయుసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాట్య మయూరి

సాధరణంగా నెమలి అడవుల్లో, ఎవరూ చూడని ప్రదేశంలో నాట్యం చేస్తుంది. అయితే ఓ నెమలి మాత్రం మండంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని జనాల గూడెంలో జనావాసాల మధ్య బుధవారం ఉదయం తన పింఛాలను విప్పి నాట్యం చేసి స్థానికులకు కనువిందు చేసింది.

- కొత్తపల్లి

